మాయ

శ్రీమతి ఆర్. వసుంధర

'సిరిపాడు!' అని కేకేశాడు కండక్టరు.

'సిరిపాట్లో దిగాల్సినవాళ్లా!' అని యింకా పెద్దగా అరిచాడు.

సత్యం మేష్టారు ఆ కేకకు వులిక్కిపడి చేతిలోని 'భజగోవిందం' పుస్తకం గబగబా చేతిసంచీలో పెట్టుకొని బస్సు దిగాడు. 'హోల్డాల్ సార్' అంటూనే హోల్డాల్ ఎత్తి కాస్త గట్టినేలమీదకు విసిరేసి 'రైట్' అన్నాడు కండక్టరు. డబ్బారేకుల తప్పెట్లలా పెద్దశబ్దం చేసుకుంటూ బస్సు ముందుకు సాగిపోయింది.

క్రితం రోజు కురిసిన వానకు కాబోలు నేలంతా కుమ్మరివాడు కలుపుకున్న బంకమట్టి దిబ్బలాగా వున్నది. పగలు కాసిన ఎండకు కాలిబాటలోని బంకమట్టి నీళ్లన్నిటినీ ఈడ్చుకొని కొద్దిగా గట్టిపడి పొలాన్నుండీ వచ్చే పోయే మనుష్యుల అడుగుల బరువుకి నున్నగా మెరుస్తూ తేలి వూళ్లోకి పోతున్న పెద్ద కొండచిలువలాగా వున్నది. బస్సు దిగిన చోటికి పది గజాలు అవతలినుండీ ప్రారంభమై తాటాకు కప్పిన వూరిళ్లు కాస్త దూరదూరంగా ఆవలికి వ్యాపించి వున్నాయి. మధ్యమధ్యలో గడ్డివాములు బంగారు రంగులో ఎత్తుగా ఠీవిగా ఏనుగల్లాగా నిలిచివున్నాయి. దూరాన వూరి మధ్యలోగా చలికి ముడుచుకు గుంపుగా కూర్చున్న ముసలివాళ్లలాగా పాత పెంకుటిళ్లు ఓ డజను ఒకేచోటులో కూర్చుని వూరిని పర్యవేక్షిస్తున్నాయి.

'ఛీ, ఛీ, ఏం పల్లెటూళ్లు!' అనుకున్నాడు సత్యం మేష్టారు చీకాకుగా. ఆయనకు పల్లెటూరితోటి తొలిపరిచయం యిదే. అంతా ఏమిటోగా క్రొత్తగా వున్నది. ఆ పెంకుటిళ్లవేపుగా వెళ్లాలనుకున్న మేష్టారు హోల్డాలు తీసుకరావటానికి ఎవరైనా దొరుకుతారేమోనని చుట్టూ చూశాడు. దూరాన పొలాల మధ్యనుండీ నల్లగా మెరుస్తున్న మెలికలబాటమీదుగా మెల్లగా భద్రంగా నడుస్తూ వస్తున్నాడో మనిషి. వూళ్లోకి వెళ్లి తలదాచుకొను చోటు వెతుక్కోవటానికి త్వరపడుతున్నాడు సత్యం మేష్టారు. అవతలి మనిషికి తొందరనేది లేనట్లుంది. అతిమెల్లగా నడుస్తున్నాడు. క్రిక్కిరిసిపోయి ఒకదాన్లో ఒకటి దూరినట్లు అలుక్కుపోయివుండే యిళ్లతో, కాలంతో, పందెంవేసుకొని పరుగులిడే జనంతో కిటకిటలాడుతుండే పట్టణానికీ చెదురుమదురుగావుండే యిళ్లతో మన్నుదిన్న పెంజేరులా మెల్లిగా కదిలే మనుషులతో కాలం లేనట్లుగా తాపీగా నడిచే పల్లెటూరికీ ఏమీ సంబంధం కనబడలేదు. 'అంతా కొత్తగా వున్నది' అనుకున్నాడు కొండచిలువలాంటి దోవనుచూస్తూ. ఎందుకో భయంవేసింది. అంతలోనే 'అక్కడా ఆ మనుష్యులే, యిక్కడా ఆ మనుష్యులే...భేదం ఏముంది!' అనుకున్నాడు, తలపైకెత్తిన భయాన్ని మనసు లోతుల్లోకి నెట్టివేస్తూ.

'వూళ్లోకి వెళ్లాలి. పరుపుచుట్ట తెస్తావా?' అనడిగాడు దగ్గరగావచ్చిన మనిషిని.

మనిషి చేతిలోని దుడ్డుకర్రను నేల కానించి నిలబడి చేతిసంచీనీ, హోల్డాలునీ, మేష్టారినీ పరిశీలనగా చూశాడు. నోట్లో నములుతున్న పుగాకు ఎంగిలిని తుపుక్కున వుమ్మేశాడు బాటప్రక్కగా. కుతూహలంగా చూస్తూ 'కొత్త ఎడ్మాస్టరా?' అనడిగాడు.

'అవును...పరుపు తెస్తావా?' అన్నాడు మేష్టారు.

'వూళ్లో అనుకుంటుండారులెండి...కొత్త ఎడ్మాస్టరు రావాలని. సూడగానే అనుకున్నా, కొత్తాయన ఎవరుండాలబ్బా అని...మా పిలగాడుకూడా ఆ బళ్లోనే సదూతుండాడు. ఎంకడని...మూడో కళాసు. మంచి సురుకుగలోడు లెండి. సూత్తారుగా...నాపేరు సాయెబు, బాబూ, పోదాం పదండి' అన్నాడు సాయెబు చేతిసంచీ,

హోల్డాలు నెత్తికెత్తుకుని ముందు దారితీస్తూ. వాడి వెనకాలే వెళ్ళాడు సత్యం మేష్టారు వూళ్ళోకి.

వేపచెట్టు చుట్టూ విశాలంగా కట్టిన నల్ల రాతి అరుగులమీద నలుగురు రైతులు కూర్చొని వున్నారు—ఎర్రటి ముతక ఖద్దరులో మోకాటి పొడుగులో కంటిమెడ చొక్కాలూ, అదేరకం పంచెలూ ధరించి. సాయెబు వాళ్ళ ఎదురుగా ఆగాడు. 'కొత్త ఎడ్మాస్టరు' అన్నాడు, తోటిపిల్లలికి గుప్పెట్లోని తాయిలం చూపిస్తున్న పిల్లాడిలా. నలుగురు రైతులూ మేష్టార్ని పరకాయించి చూశారు. అందులో ఒకాయన లేచి నిల్చున్నాడు. నోట్లోంచీ చుట్టతీసి 'రండి, యింటికి వెళ్దాం... నేను యీ వూరి బోర్డు ప్రెసిడెంటుని. నా పేరు శ్రీమన్నారాయణ...' అన్నాడు. మిగతా ముగ్గురు రైతులుకూడా లేచారు, చొక్కాలు సరిచేసుకుంటూ. 'పదండి, మేం కూడా అటే వస్తున్నాం' అన్నారు.

నాలుగు రోజులు ప్రెసిడెంటు యింట్లోనే వుండిపోయాడు సత్యం మేష్టారు. అప్పటికి తన కోసరం నాలుగురూపాయిల అద్దెతో ఏర్పాటయిన చిన్నపూరిల్లు అలికి ముగ్గులు పెట్టించటం పూర్తయింది. పైన తాటాకు తిరగ కప్పించారు. అయిదో రోజున అందులో చేరాడు. చేరాక తెలుగు కాలెండరు సున్నంకొట్టినమట్టిగోడకు తగిలిస్తూ తిథీ నక్షత్రం చూసి గతుక్కుమన్నాడు. ఆ వేళ అష్టమీ మంగళవారం కృత్తికా నక్షత్రం. కాని అంతలోనే మనస్సు చిక్కబట్టుకొని 'ఆ, ఏమిటో, అంతా మాయ! తిథి నక్షత్రాల్లో ఏముంది' అని ఆ విషయాన్ని మనసులోంచీ కొట్టిపారేశాడు.

పెంకుటిళ్ళకు కాస్త దూరంగా పూరిళ్ళ మధ్యలో దర్జాగా తలెత్తుకు నిల్చొనివుంది ఎలిమెంటరీ స్కూలుకి కొత్తగా కట్టిన భవనం. పల్లెటూరి సినిమాహాలులాగా అదీ ఒక రేకులషెడ్డే అయినా ముందరిభాగంమాత్రం ఘనంగా వున్నది—ఓ కంట్రాక్టరుకు చదువుగురించివున్న అభిప్రాయానికి రూపు కల్పిస్తూ. రోడ్డులో నిలబడిచూస్తే సినిమాహాలో, రైస్‌మిల్లో అనిపించినా దానిమీద నికరమైన నాలుగు రంగుల్లో 'ఎలిమెంటరీస్కూలు, సిరిపాడు' అని వ్రాసి వున్నది, ఏవిధమైన అపోహలకూ తావివ్వకుండా.

'ఇదివరలో ఓ పాతపెంకుటింట్లో వుండేది బడి. నేను ప్రెసిడెంటయ్యాకనే యీ బిల్డింగును కట్టించాను' అని శ్రీమన్నారాయణ ఉత్సాహంగా చెప్పాక బిల్డింగును గమనించి 'బాగుంది! బాగుంది!' అన్నాడు మేష్టారు.

* * *

వూరి పరిస్థితి మేష్టారికి ఏమాత్రం నచ్చలేదు. వూళ్ళో పార్టీ రాజకీయాలు వుధృతంగా వున్నాయి. సిరిపాడు పంచాయతీలోనే దానికి అనుబంధంగావున్న వుత్తరపువేపుమాలపల్లె దక్షిణాన వుప్పుకాలువదగ్గరున్నమాదిగవాడ తూర్పువేపునచాకలిపేట అన్నీ కలిసేవున్నై. రైతులు కొద్దిమంది. ఎలక్షన్లలో వయోజనఓటు అంటూవున్నది గనుక అధికారం నిలుపుకోవటానికి రైతులకు భూసంపద గొప్పదనం అనేవి పనికిరాకుండావున్నై. మాల మాదిగ వాడల్లోని మెంబర్లూ, రైతులూ వాళ్ళఆశ్రితులూ అయినవారిమెంబర్లూ అందరూ కలిసే ప్రెసిడెంటును ఎన్నుకోవాలి. ఇద్దరూ దాదాపు సమాన సంఖ్యలోనే వున్నారు. తను జీతగాళ్ళుగా కూలివాళ్ళుగా వుంటూన్నవాళ్ళది పైచెయ్యి అయి, ప్రెసిడెంటు గిరీ వాళ్ళపరవౌతుందేమోనని రైతులు నానాగుంజాటనా పడిపోతున్నారు. యింత బ్రతుకూ బ్రతికి యింటి వెనుక చచ్చినట్లు!... క్రిందటితూరి ఎలక్షన్లలో మాలవాళ్ళు మంచిపట్టుమీదే వున్నారు, ఎట్లైనా ప్రెసిడెంటనిపించుకోవాలనీ, రైతుల పొగరు అణగ కొట్టెయ్యాలనీను. కాని చివర్న ఎన్నో లంచాలు, ఏవో ప్రలోభాలూ చూపించి రైతులు కోటిగాణ్ణి వాళ్ళ ప్రక్కకు తిప్పేసుకుని యీసారికి ప్రెసిడెంటు గిరీ వాళ్ళదే ననిపించుకునేసరికి మూడు చెరువుల నీళ్ళు త్రాగినంత పనైంది. ఏ వూరినుండో పొట్ట చేతబట్టుకొని వచ్చి జీతగాడుగా స్థిరపడిన గవన్నబాసదు కూలి వాళ్ళ ప్రక్కన తీవ్రంగా పనిచేస్తున్నాడు... ఈ విషయాలన్నీ శ్రీమన్నారాయణే మేష్టారితో చెప్పాడు.

మేష్టారికి రాజకీయాలంటే ఏవగింపు. ఆయన తమ మనిషని అనిపించుకోవాలని రెండు పార్టీల వాళ్ళూ ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఆయన ఎటూ మొగ్గు చూపలేదు. అసలా విషయమే పట్టించుకో

లేదు. పల్లెటూరి ప్రజలమీద అసహ్యం పుట్టుకొచ్చింది. తిండీ, నిద్రా, సంసారం యిందులో పర్మీలుకొడుతుండే చిన్నబ్రతుకుల మనుష్యులు వాళ్ళు. వూసుపోక తగూలు ముందేసుక కూర్చుంటారు. ఓచదువూ, జ్ఞానం, సత్యం ఏవీగా ఎరుగని మూర్ఖులు...'భజగోవిందం, భజగోవిందం మూఢమతే!...'అనుకున్నాడు మేష్టారు విసుగ్గా.

మేష్టారికి కావలసిన పది మానికల బియ్యం నెల నెలా ప్రెసిడెంటుగారే పంపిస్తున్నారు. పాలూ, పెరుగూ యితర రైతులు పంపిస్తున్నారు. అప్పుడప్పుడు కూరగాయలుకూడా వస్తున్నాయి. మిగతా యిద్దరు పంతుళ్ళకు కూడా బియ్యం తప్పించి మిగతా సప్లైలు జరుగుతూనే వున్నాయని తెలిసింది. బళ్ళో రైతుల పిల్లల్ని ముందువరుసలో కూర్చోబెట్టి మిగిలినవాళ్లను కాస్తంత దూరంగా కూర్చోబెట్టారి. వాళ్లని ఏ సందర్భంలోనూ కోప్పడకూడదు. వాళ్లను 'అమ్మా' 'బాబూ' అనే పిలుస్తున్నారు ఆ పంతుళ్లిద్దరూ.

సాయెబు కూడా రెండుసార్లు సొరకాయలు తెచ్చియిచ్చి బళ్ళో రైతులపిల్లల్ని వేరుగా కూర్చోబెట్టటం గొప్పగా చూటడం బాగాలేదని చెప్పివెళ్ళాడు. చదువుకునే పిల్లల్లో యిలా భేదభావం చూపించటం న్యాయంకాదని సత్యంమేష్టారు అనుకున్నాడు. కాని యీ వూరితో తనకు సంబంధమూలేదు; యీ పరిస్థితి తానేర్పరచిందీకాదు. అదీగాకుండా తనొక్కడూ వూనుకున్నా ఏవీగా మార్చలేడు. 'యీ దేశంలో ఎక్కడ చూసినా రాజకీయాలేగాని న్యాయం ఎక్కడేడ్చింది!' అనుకున్నాడు మేష్టారు. అందువలన యివన్నీ పట్టించుకోకుండా వుండే పద్ధతిని సాగనివ్వటమే సులువైన పద్ధతిగా తోచింది. అందువలన రైతులిచ్చిన వస్తువులన్నీ పుచ్చుకొంటూవేవున్నాడు. వాళ్ల పిల్లలు వేరుగా కూర్చున్నవిషయం మరచిపోతున్నాడు. అన్నీ మామూలుగా సులువుగా జరిగిపోతున్నై...

ఈ పల్లెటూరివాళ్లకుండే మరో అలవాటు అవతలివాళ్ల అజలన్నీ కనుక్కోవటం. ముదురు వయసులోవుండే మేష్టరు ఒంటరిగా సంసారం పెట్టటం వాళ్ల కుతూహలాన్ని రేకెత్తించింది. 'ఒకరే చెయ్యి కాల్చుకుంటున్నారు. సంసారం ఏం లేదా?' అన్న ప్రశ్నకు సమాధానంగా 'మొన్నటివరకూ అమ్మవుండేది. పోయింది. యిప్పుడు ఒకణ్ణే వుంటున్నాను' అన్నాడు. పెళ్లయిందా? పెళ్ళాం వుందా? అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలనిపించలేదు. చెప్పలేదు.

ఉదయం తొమ్మిది గంటలకంతా వంట పూర్తి చేసుకుంటాడు మేష్టారు. వూడ్చటం, గిన్నెలు కడగటం, స్నానం చేశాక పంచే బనీనూ పిండి ఆరవేయటం యీ పనులన్నీ నాలుగు రోజులు కోటయ్యగారి పాలేరు పిల్లాడు చేసిపెట్టాడు. తరువాత పనిచేస్తానని రత్తి వచ్చింది. కూలిపని లేనప్పుడు వూళ్ళో కూరగాయ లమ్ముతుంది రత్తి. దాని మొగుడు బాసడు ఎవరింట్లోనో జీతగాడుగా వున్నాడు; తాగుబోతు ముండాకొడుకు; సంపాదించిందంతా తాగేస్తాడు; పిల్లాజెల్లా లేరు – అన్నీ చెప్పింది రత్తి. సరే, చెయ్యమన్నాడు మేష్టారు.

మర్నాడు వుదయం కోటయ్యా యింకో యిద్దరు రైతులూ వచ్చారు. 'రత్తి పని మురిగ్గా చేస్తుంది దాన్ని ఎవరూ పనికి పెట్టుకోలేదు వూళ్ళో; దాని మొగుడు తాగుబోతు; అది లేవదీసుకొచ్చిన రకంగా కన్పిస్తోంది; దాన్ని పనికి పెట్టుకోవటం మంచిది కాదు' అని చెప్పారు. రత్తి మొగుడు గవన్నబాసడు అవతలి పార్టీవాడన్న విషయం గుర్తొచ్చింది మేష్టారికి. రత్తి పని చెయ్యటం అప్పటికే ఒక రోజు చూచివున్న మేష్టారికి అది పని మురిగ్గా చేస్తుందన్న విషయం బాగానే తెలిసింది. అయినా 'ఏదో జరిగినన్నాళ్ళూ జరగనివ్వండి. దాని గుణంతో నాకేం పని' అన్నాడు. చెప్పవచ్చిన వాళ్ళు మరేంమాట్లాడలేక అప్పటికి వూరుకున్నారు. నేనెప్పుడూ యీ వూళ్ళోనే వుండబోతానా!' యింకో మంచి వూరికి బదిలీ రాకపోతుందా! అనుకున్నాడు మేష్టారు మనసులో.

పది రోజులు జరిగేసరికి పందికొక్కు కన్నాలు పూడ్చటం, యిల్లలకటం యింటిపనిచెయ్యటంతో పాటుగా పొయ్యిముట్టించటం బియ్యంకడిగివ్వటం లాంటి చిన్నపనులు చేయటం ప్రారంభించింది రత్తి. దాని మడ్డితనానికి అసహ్యం వేస్తున్నా, అది చేస్తున్న సహాయంమాత్రం బాగానే వుంది మేష్టారికి. ఆయనకు భగవద్ధ్యానం తప్పించి మిగతావన్నీ అల్పవిషయాలు. 'భజగోవిందం' శ్లోకాలన్నీ రోజుకోసారైనా చదువు

కొని వాటిలోని స్వారస్యం అనుభవించనిదే ఆయనకు మనసు బాగుండదు. అవన్నీ ఎప్పుడో కంఠతా వచ్చేసినై. అయినా అందులోని సారాసారం వివేచన చెయ్యాలంటే పుస్తకం ముందుంటేనే బాగుంటుందని అనుకుంటాడు. ఆ పుస్తకమే ఆయనకు వేదవేదాంగాల సారం.

వూళ్లో రైతులకు మేష్టారి వాలకం సరిగా అంతుబట్టటం లేదు. యిచ్చినవన్నీ పుచ్చుకుంటాడు గాని యిచ్చారుగదా అన్నభావం కన్పించదు. బయట దోవలో కనిపించి నవ్వినా చూసీమూడనట్లుంటాడు. పలకరించినా సరిగా తిరుగూ ఒరుగూ చెప్పడు. ఈ ముభావం వాళ్లకు కొరుకుడు పడలేదు. 'మన చేతికిందే వుంటాడంటారా?' అనుకున్నారు రచ్చబండమీద సందేహంగా. ప్రెసిడెంటు వాళ్ల సందేహాన్ని కొట్టిపారేశాడు. 'మనింట్లో వున్న నాలుగు రోజులూ నేను బాగా చూశానుగా...ఆయనది ఒక రకంలే. ఎప్పుడూ ఏదో వేదాంతధోరణిలో వుంటాడు. శ్లోకాలు పాడుకుంటాడు. మన లోకం లేదు.. వేదాంతం కదిలించారంటే బాగానే మాట్లాడతాడు' అన్నాడు.

కాస్త వేదాంత ధోరణి తమలో వున్నదనుకునే రైతులు నలుగురూ 'పుణ్యంకోసం' మేష్టారింటికివెళ్లి రెండు శ్లోకాలకు అర్థం విని రావటం ప్రారంభించారు. సంవత్సరానికోసారి మూటపదార్లిచ్చి శాస్త్రుర్లవారిని పిలుచుకొచ్చి హరికథ చెప్పించుకున్నట్లుగా మేష్టారిచేత శ్లోకాలు చెప్పిస్తే అందరూ నాలుగు మంచి మాటలు విన్నట్లు వుంటుంది; మేష్టారు మన మనిషని మిగతా వాళ్లకూ తెలిసొస్తుంది—అనుకున్నారు.

వూళ్లో వాళ్ల చెవిలో నాలుగు మంచి మాటలు వెయ్యటానికి సత్యంమేష్టారికి యిష్టమే అయింది. ఇదివరలో ఆయన ప్రతిభను గుర్తించి యిలాంటి కోరిక ఎవరూ కోరలేదు. 'పల్లెటూళ్లే నయం ఒక్కోసారి' అనుకున్నాడు మేష్టారు.

రచ్చబండ పెంకుటిళ్ల మధ్యన మూడు దోవల చేరికలో వున్నది. భోజనాలయ్యాక తీరుబాటుగా రైతులు ఓ ఇరవైమంది వరకూ చేరారు అక్కడ. పెద్దవారు బండమీదా సన్నవారు క్రింద చాపలమీదా కూర్చున్నారు. పాలేళ్లూ అలగా వాళ్లూ కొందరు గోడలవారగా క్రింద మట్టిలోనే కూర్చున్నారు. మగవారి కంటబడరు గనుక ఆడవారు రచ్చబండకు ఆ ప్రక్కా యీ ప్రక్కావుండే నాలుగిళ్లలోనూ అరికిన దొడ్లలో చాపలూ దుప్పట్లూ వేసుకుని కూర్చున్నారు. యింటి చుట్టూ కట్టిన తాటాకు దడిమీదుగా రచ్చబండ కన్పిస్తుంది వారికి.

మేష్టారికి గొంతు పెద్దదీ కాదు; రాగయుక్తంగా పాడటమూ బాగా రాదు. ఇంట్లో చదువుకునే స్థాయిలోనే జంకుతో ప్రారంభించినా అలవాటూ వుత్సాహం వుండటాన సులువుగా శ్లోకాల్లోకి దూకేశాడు. అర్థం చక్కగా వివరించి చెబుతున్నాడు. 'చచ్చాక బంధువులేమిటి, పెళ్లాం బిడ్డలూకూడా నీ కట్టెను అవతల పారేస్తారు. ప్రాణం వున్నంతసేపే యీ బంధాలన్నీను. బ్రతికినన్నాళ్లూ ఏవేవో ఆసక్తులతో తారట్లాడుతావు, తరువాత మట్టిలో కలిసి పోతావు. ఆడదంటే ఎముకలతోటీ రక్తమాంసాలతోటీ ఏర్పడిన ఆకారమే. ఆ ఎత్తు పల్లాలనుచూసి భ్రమసి పోవటం మూఢత్వం. ఈ మాయలోంచీ బయటపడు. జీవితం ఒక కొండచిలువ. అది నిన్ను మింగేస్తుంది! దేవుణ్ణ ధ్యానించు' అని చెప్తూంటే మేష్టారి గొంతులోంచీ మాయ అంతా వుమ్మిగానూ వమనంగానూ బయటకొచ్చేస్తున్నట్లనిపిస్తోంది. వింటున్న వాళ్లకు సంసారం మీద విరక్తిగాని ఆడవాళ్లమీద అసహ్యంగాని కలుగకపోయినా 'ఆయన చెప్పేదంతా నిజవే కదా. మంచి సత్యం చెబుతున్నాడు' అనుకుంటున్నారు.

ఉపన్యాసం మంచిపట్టులో వుండగా ఒకాయన లేచాడు. దడదడా బండదగ్గరకు నడిచి వచ్చాడు. 'నాదొక సందేహం...' గట్టిగా అందరికీ వినిపించేట్లు అని గర్వంగా అందరివైపూ ఓ మారు చూశాడు. 'మనుష్యులకి యీ భ్రమంతా ఎందుకిచ్చాడు దేవుడు?' అన్నాడు సవాలు చేస్తున్నట్లు. సత్యం మేష్టారికి నవ్వొచ్చింది. చిన్నపిల్లలడిగే తెలివితక్కువ ప్రశ్నలాగా తోచిందది. 'అంతా కర్మనుంచీ ఒస్తుంది...ఎవరు చేసిన కర్మ వారనుభవింపకా ఏరికైనను తప్పదన్నా...' అన్నాడు మేష్టారు రాగయుక్తంగా. అందరూ నవ్వారు. 'కర్మమాత్రం ఎక్కణ్ణుంచీ ఒచ్చిందయ్యా మొదట? ఈ మాయ అంతా దేవుడు ఎందుకు ఏర్పరిచాడు?' అన్నాడు లేచినాయన కోపంగా. సత్యం మేష్టారికి యీ సారి సమాధానం గభాల్న తోచలేదు. ఒక నిముషం బిత్తర

పోయి తరువాత గుంభనగా అన్నాడు నవ్వుతూ 'అంతా ఆ పరమేశ్వరుని లీల అంటారు...అదీగాకుండా నిజమైన దానికి కారణం వుంటుందిగాని, లేనిదానికి, మాయకు, కారణం ఏముంటుంది లీలకాకుంటే!' అన్నాడు. ఈ సమాధానం అందరికీ నచ్చినట్లుంది. 'కూర్చోవయ్యా, శేషయ్యా...ఏమిటో నాలుగు మంచి ముక్కలు చెవినేసుకుపోక యీ ప్రశ్నలేమిటి! నీ వెప్పుడూ యింతేగా!...' అని విసుక్కున్నారు. మేష్టారి సమాధానానికి తిరుగు తోచలేదు శేషయ్యకు వెంటనే. 'ఆలోచనుండే వాడికైతే ప్రశ్నలొస్తాయి. మీకేం తెలుస్తుందిలే!...బూటకపు వేదాంతం... దేవుడూ లేడు, దయ్యమూ లేదు!' అని దూకుడుగా అని విసురుగా కూర్చున్నాడు.

మరునాడు వుదయం వుల్లాసంగా వుంది మేష్టారికి. గాలిలో తేలిపోతున్నట్లుగా చకాచకా పని చేసుకున్నాడు. రత్తి గిన్నెలు మురికిగా కడిగినా ముభావంగా వుండేవాడు కాస్తా యీ రోజు 'ఏమే, నిన్న ఏ గిన్నెలో ఏ పదార్థం వండేనో మరచిపోతానని కొంచెం కొంచెం మిగిల్చి పెడతావా కడిగేటప్పుడు?' అని పరిహాసం కూడా ఆడేడు. మాటి మాటికి క్రితం రాత్రి సభలో జరిగిన సంభాషణే జ్ఞప్తికి వస్తోంది. శేషయ్య ప్రశ్నవేయటం దానికి అతికినట్లుగా మంచి సమాధానం తానివ్వటం ఎందుకో మనసులో నిలిచిపోయింది. 'నిజమైన దానికి కారణం వుంటుందిగాని మాయకు కారణమేవిటీ!' అన్నాడు తాను. మాయకు కారణాలు మాయలోని కారణాలు ఏమిటి వెర్రిగాకుంటే!

ఇంటికి వచ్చిన కోటయ్యను 'నిన్న రాత్రి ప్రశ్న లడిగిన శేషయ్య ఎవరు?' అనడిగాడు మేష్టారు. కోటయ్య నవ్వి 'వాడా...వాడో తలతిక్క ఘటంలెండి... ప్రతిదానికీ అడ్డుప్రశ్నలువేసి తన తెలివి చూపించుకోవాలనుకుంటాడు ఎప్పుడూ. అందరూ తెలివి తక్కువ వాళ్లనీ తనేమో మహాతెలివిమంతుణ్ణనీ గర్వపడిపోతుంటాడు...అందరూ వాణ్ణి వుత్తరాల పిచ్చాడంటారు. దేశంలో గొప్పోళ్లందరికీ వుత్తరాలు రాస్తాడు. సమాధానాలువస్తే వాటిని పదిలంగా దాచి వాళ్లతో సమానంగా తనూ ఓ గొప్పోణ్ణని పొంగిపోతుంటాడు. వాడి దగ్గర మంత్రులు, పుస్తకాలు రాసేవాళ్లు, నెహ్రూ దగ్గరినుండీకూడా వుత్తరాలున్నాయి...' అని పెద్దగా నవ్వేశాడు కోటయ్య.

శేషయ్య తీసిపారెయ్యాల్సిన మనిషిగా కన్పించలేదు, మేష్టారికి. మిగతా వాళ్లందరూ అన్నింటికీ గొర్రెపోతుల్లా తలలూగిస్తూంటే, ఆలోచించగల సామర్థ్యం శేషయ్యకే వున్నట్లు తోచింది. అంతే గాకుండా అతను లేవదీసిన ప్రశ్నగాని దానికి తానిచ్చిన సమాధానంగాని చాల వున్నత స్థాయిలో వున్నట్లు తోచింది. ఈ వెధవ పల్లెటూళ్లో యింత మేధావి వుండటం ఆశ్చర్యంగానే వున్నది...శేషయ్యతో పరిచయం పెంచుకోవాలని వుత్సాహంగా వున్నది మేష్టారికి.

వూళ్లో వాళ్లు చూపించిన గౌరవ మర్యాదలు చూపించలేదు శేషయ్య. 'నువ్వు, నువ్వు' అనే సంబోధించాడు. 'అంతా మాయ అంటున్నావు. కడుపునిండా తిని నెలనెలా జీతం తెచ్చుకుంటూ, ఏ బాదరబందీ లేకుండా వుండే వాడివి, జీవితం గురించి నీవేం ఎరుగుదువయ్యా? ఈ కడుపు నిండిన వేదాంతం ఎవరైనా చెప్పగలరులే' అన్నాడు హేళనగా. 'నా బ్రతుకంతా నేను కష్టపడి నిర్మించుకున్నానయ్యా. నా కెవడూ కించిత్తు సహాయంకూడా చెయ్యలేదు — చెయ్యని వాడెవడో వున్నాడని నేను ఎలా నమ్మేది? ఆ దేవు డెవడో నాకు తెలియదు...నా చిన్నతనంలోనే అమ్మా నాన్నా పోయారు. మేనత్త దగ్గర చేరాను. అప్పుడు నా పేర్లేమిటో తెలుసా—'చచ్చు పీనుగా' 'మొద్దుసన్నాసీ'ను. చాకిరీ చేయించుకొని తిండి పెట్టేది. సినిమాకి డబ్బులు కావాలంటే పేకాటలో సంపాదించేవాణ్ణి. ముంజెలు, తోటలో కొబ్బరి కాయలు, పచ్చిమామిడికాయలు—ఏవి వీలయితే, అవి యిచ్చి కొట్లో బీడీలూ అగ్గిపెట్టెలూ తెచ్చుకునే వాణ్ణి. నా కథ వింటే నీలాంటి వెర్రివేదాంతులు దొంగ అనీ, చెడిపోయినవాడనీ అనుకోవచ్చు. అలాంటిదేమీలేదు! నేను అప్పుడు దొంగనైతే యిప్పుడు దొంగగా ఎందుకులేను! మర్యాదస్థుణ్ణి ఎట్లా అయ్యాను?...నేనప్పుడూ దొంగని కాదు. నేను చేసిన చాకిరీకి న్యాయమైన ధరనే పుచ్చుకున్నాను. ముసల్ది చేజేతులా యివ్వలేనిది తెలియకుండా పుచ్చుకున్నాను... యింతపనీ చేయించుకొని నన్ను కమతగాడిగా వుంచేసేదే. ఆవిడ కూతురు సుబ్బులుచేత ప్రేమింపజేసు

కొని, దాన్ని పెళ్ళాడేను. ఆస్తి స్వంతదారు నయ్యేను. వుండే అయిదెకరాలూ మగతా కిచ్చాను...యిదిగో శుభ్రంగా బట్టలువేసుకొని బుజంమీద పేటంచు వుత్తరీయం వేసుకొని పెద్దమనిషిగా వున్నాను...' అంటూ పెద్దగా విపరీతంగా నవ్వేడు శేషయ్య.

శేషయ్య మాటలు మేష్టారిలో సంచలనం కల్గించాయి. తనది కడుపునిండిన వేదాంతం కాదనీ, అది తన జీవితాన్ని నడిపే సత్యమనీ, తను నమ్మిన నిజమనీ శేషయ్యకు ఎలా నచ్చచెప్పాలో తెలియలేదు. 'శేషయ్యా, నన్ను నమ్మి! నేను చిన్నప్పటినుండీ ఏకాకిగా బ్రతికాను...' అనాలనిపించింది. ఎందుకో శేషయ్య తనను నమ్మటం అవసరమనిపించిందికాని శేషయ్య నమ్మడు; ఎగతాళి చేస్తాడు; నీకు తల్లి, ఆస్తి వున్నదంటాడు. నిజానికి తనకు అందరూ అనుకునేవిధంలో తల్లిలేదు. చిన్నప్పుడుకూడా ఆమె మీద తాను ఆధారపడలేదు. ఆమెను ఒక మనిషిగా, వేరుగా చూశాడేగాని తన తల్లిగా తనలోని భాగంగా చూడలేదు. తనకు గుర్తున్నంతవరకూ ఆమె ఎప్పుడూ స్నేహితులతో పచ్చీసూ గవ్వలూ వామనగుంటలూ ఆడుతూ తా ననుభవిస్తున్న బాధలగురించీ తన అసహాయజీవితాన్నిగురించీ మాట్లాడుతూ ఏడుస్తూ వుండేది. ఆమె మాటలన్నీ అబద్ధాలుగా, 'ఆ ఏడుపు మొసలి కన్నీటిలా, ఆమె బ్రతుకు అసత్యంగా అనిపించేది...ఎదుటివాళ్ళను నిశితంగా పరీక్షించే గుణం చిన్నప్పటినుండీ వున్నది తనకు...తాను అందరిలాంటివాడుకాదు—అప్పుడూ, యిప్పుడూ కూడా! వేదాంతిలా జీవితానికి దూరంగా కూర్చొని కాలం గడిపాడు! పదేళ్ళక్రితం ఆవిడే తనకు పెళ్ళంటూ ఒకటి చేసింది. పెళ్ళిలోనే కానుకలదగ్గర పేచీ వచ్చింది. పెళ్ళాం ముఖంకూడా సరిగా చూడలేదు. పుట్టినప్పటినుండీ ఏకాకిగా బ్రతికిన తనను 'బాదరబందీ లేని జీవితం, కడుపునిండిన వేదాంతం' అంటున్నాడు శేషయ్య. 'ఏమిటో, అంతా మాయ!' అని నిట్టూర్చాడు మేష్టారు.

* * *

రాబోయే ఎలక్షన్లకోసం అప్పుడే ప్రచారం ప్రారంభమైంది. శేషయ్య రైతులకి వ్యతిరేకంగా కూలివాళ్ల పక్షానికి తిరిగిపోయాడు. శేషయ్యతో మాట్లాడటం మంచిదికాదని రైతులు మేష్టార్ని హెచ్చరించారు. 'ఈ పట్టింపు లన్నీ నాకు లేవు' అన్నాడు మేష్టారు. పాలు పెరుగుల సప్లై తగ్గిపోయింది. 'ఆళ్ళు దొంగముండాకొడుకులు. పని జరుపుకోడాని కిత్తారుగాని వూరికేనే యిత్తారా?...... యిన్నాళ్ళూ యీ కొంపని కొక్కులు తవ్వేత్తున్నా యని ఎవరన్నా యింట్లో దీపం పెడ్తేసాలని సూత్తుండారే. ఆళ్ళోళ్ళదనిగెందా మీకు నాలుగు రూపాయిలకి అంటగెట్టారు' అన్నది రత్తి.

శ్రీమన్నారాయణగారి కళ్ళంలో గింజలు దొంగలు ఎత్తుకపోయారు, కావలిపడుకున్న జీతగాణ్ణి కొట్టి. రైతుల అనుమానం బాసడిమీద పడ్డది. వాడు అడపాదడపా చిన్నదొంగతనాలు చేస్తున్నట్లు వాళ్ళకి అనుమానంగానే వున్నది ముందునుంచీ. దొడ్లలోని కొబ్బరికాయలూ, వీలు చిక్కినప్పుడూ పురుల్లోని ఒడ్లూ పోతూనేవున్నై. రాజకీయపు పట్టుదలమీద వున్న రైతులు యీసారి దొంగని పట్టితీరా లనుకున్నారు. అంతా కలిసి దౌర్జన్యంగా వాళ్ళ యిళ్ళలో దూరి సోదా చేశారు. అన్నీ కూలికి తెచ్చుకున్న రకరకాలు కలిసిన ఒడ్లేగాని ప్రెసిడెంటుగారి ఒడ్లు ఎవరింట్లోనూ దొరుకలేదు.

ఇంత దౌర్జన్యం చేసినందుకు మీ పనుల్లోకి రామని కూలివాళ్లు తిరుగబడ్డారు. రైతులు రెండు బస్తాల ఒడ్లు బాసడి యింట్లోనూ రెండు బస్తాలు సాయెబు యింట్లోనూ వేయించి అందరిమీదా కలిపి కేసు పెట్టించారు. 'వాళ్ళిలాగూ దొంగలే, తప్పులేదు. కోర్టులచుట్టూ తిరిగి చావనీ. రోగం కుదురుతుంది. ప్రెసిడెంటుగిరీ కావాలట!' అనుకున్నారు.

రెండుమూడు రోజుల కోసారి కేసు వాయిదా వచ్చేసరికి పదిహేనుమంది కూలివాళ్ళూ ప్రొద్దున్నే చద్దికూడుతిని కొంచెం మూటగట్టుకొని రేపల్లెకు నడిచివెళ్లటం, కేసు మరో వాయిదాపడటం, రాత్రికి కాళ్లీడ్చుకుంటూ తిరిగి రావటం మామూలైపోయింది. ఓప్రక్క డబ్బుఖర్చూ అవుతోంది, వాయిదా రోజుల్లో కూలిపనీ లేకుండాపోతోంది. రెండునెల్లు తిరిగేసరికి వాళ్ల ప్రాణం కడబట్టినట్లయింది. కాని బాధ ఎక్కువైనకొద్దీ పట్టుదలా ఉక్రోషం జాస్తిఅయాయేగాని వాళ్ళు లొంగిరాలేదు. రెండు పార్టీల మధ్యా పచ్చగడ్డివేస్తే భగ్గుమనేట్లు తయారైంది పరిస్థితి.

భగ్నమనిపించిన పచ్చగడ్డి బళ్లోనే పడ్డది. ప్రెసిడెంటుగారి కొడుకు సుందరం క్లాసుకు కాస్త ఆలస్యంగావచ్చి ముందువరుసల్లోకి వెళ్తుండగా దోవలో సాయెబు కొడుకు ఎంకడు కాలు అడ్డం వెయ్యటం, సుందరం బోల్తాపడటం, వెనుక వరుసలవాళ్లంతా పెద్దగా నవ్వటం జరిగింది. సుందరం మొహం కంద గడ్డలా చేసుకొని క్లాసంతా తేరిపారజూశాడు. సత్యం మేష్టారు ఏవీా గమనించకుండా పుస్తకం చూసు కుంటున్నాడు. క్రిందపడిన పలకను ఎత్తుకొని గురి చూసి ఎంకడివీాదకు విసిరాడు సుందరం. పలక నేరుగాపోయి ఎంకడి కంటిపైన తగిలింది. నెత్తురు ధార కట్టింది.

మేష్టారు లేచివచ్చి సుందరాన్ని ఒక్క లేపి యింటికి పంపించేశారు. ఎంకణ్ణి బావిదగ్గరకువెళ్లి కన్ను కడుక్కొని యింటికి వెళ్లమన్నాడు. కాస్సేపట్లో సుందరాన్ని వెంటబెట్టుకొని కోటయ్య వచ్చాడు. 'పెద్దా చిన్నా అంతరం ఎరక్కుండా ప్రెసిడెంటుగారి పిల్లాణ్ణి కొట్టి యింటికి తరిమేస్తావా? తిన్నయింటి వాసాలు లెక్కబెడతావా? యిదంతా వూరికినే పోతుం దనుకోకు!' అని యిష్టంవచ్చినట్లు తిట్టేశాడు. సత్యంమేష్టారికి నోరుపెగిరి ఒక్కమాట రాలేదు. వీళ్ల వెధవ సప్లైలు తీసుకోకుంటే బాగుండేది' అనుకున్నాడు. కోటయ్య అటు వెళ్లగానే సాయెబు బాసడూ యింకో యిద్దరూ ఎంకణ్ణి ఎత్తు కొని వచ్చారు. ఎంకడికి కుడికంటి ప్రక్కగా నల్లగా వాచిపోయి వున్నది. దానివీాద పసుపు నిండుగా పట్టిం చారు. 'పెద్దోళ్ల అండవుంటేమాత్రం మంచీ చెడ్డా అక్కర్లేదా? కాస్తలో తప్పోయిందిగాని కన్నుపోయిన పన్తైపోతే పిలగాణ్ణి ఒక్కణ్ణే యింటికెళ్లమంటారా? ఆ కొట్టిన దొరబాబుని ఏం చేశారు?' అని నిల దీశాడు సాయెబు. 'ఆళ్లకో నాయం యీాళ్లకో నాయం ఏందయ్యా? అసలు రోగం నీ దగ్గిరే వుంది. ఆళ్లనీ యీాళ్లనీ ఏరేరుగా కూకోబెట్టటం దేనికి?' అన్నాడు బాసడు పొగరువోత్తనంగా మీదికివస్తూ. వాడి నోట్లోంచీ కల్లువాసన గుప్పున కొట్టింది. 'పై వోళ్లకి పిటేసన్ రాసిపడెయ్యాల' అన్నాడు యింకోడు. అందరూ వెళ్లిపోయాక 'బళ్లోకివచ్చి యిలా గలాటా చెయ్యటానికి వీళ్లకేం హక్కుంది? బయటికి పొమ్మని చెప్పివుంటే?...ఈ వూళ్లో వాళ్లు మహాదౌర్జన్యకారి మనుషులు!' అనుకున్నాడు సత్యం మేష్టారూ. అంతా తలాతోకాలేని విషయంగా కనిపించింది. 'ఈ వూరినుంఛీ బదిలీ త్వరగా ఒస్తే బాగుండును' అనుకున్నాడు. మనశ్శాంతికోసం 'భజ గోవిందం' తెరిచాడు. నాలుగు శ్లోకాలు చదివేసరికి మనసుకాస్త కుదుటబడ్డది. 'కామక్రోధాది అరిషడ్వర్గం ఆడిస్తుంటే శ్లేష్మంలోపడ్డ యీాగల్లాగా మాయలో పడి తన్నుకుంటున్నారు' అనుకొని ఆ విషయం మనసు లోంచీ కొట్టిపారేశాడు.

సాయంత్రం శేషయ్య కనబడి ఎగతాళిగా నవ్వుతూ 'ఏమయ్యా, మేష్టారూ, నీ కృష్ణలీలల్ని గురించి ఏమిటో వినబడుతోందే. పెద్దనీతులు చెపు తావు పైకి...రత్తి మాయలోపడి ప్రెసిడెంటు కొడు కునే కొట్టావటగా. వాళ్లు వుడికిపోతున్నారులే' అన్నాడు. మేష్టారికి చాల కోపం వచ్చింది. 'ఏవిటి శేషయ్యా నీ వనేది?...ఛీ, ఛీ...' అన్నాడు.

ఇంటికివచ్చి కూర్చున్నాడు. మనసు చీకాగ్గా వున్నది. 'శేషయ్య ఎందుకలా అన్నాడో! అసలీ పుకారు ఎలా ఒచ్చిందో కనుక్కుంటే బాగుండేది...ఆఁఏమిటో ఈ వెధవ పల్లెటూళ్లల్లో యిలాంటి వాటికి కొదువే ముంటుంది! అల్పపు మనుషులు,!' అనుకున్నాడు. కారణంలేని భయంలాంటి ఆవేశంతో చెదిరిపోయి మన సంతా అల్లకల్లోలంగా వున్నది. 'ఇదంతా వాళ్ల మౌఢ్యమేగాని నాకేం సంబంధం లేదు' అనుకున్నాడు భజగోవిందం పుస్తకం చేతిలో పట్టుకొని...

రత్తి పనికి ఆలస్యంగా వచ్చింది. నెలరోజు ల్నుంఛీ కూలికిపోయి, అక్కణ్ణుంఛీ చీకటిపడ్డాకనే పనిలోకి వస్తోంది. మేష్టారు దీపంకూడా ముట్టించు కోకుండా చాపవీాద పడుకొనివున్నాడు. కళ్లు మూసు కొని రత్తివచ్చి దీపం ముట్టించింది. గబాగబా గిన్నెలు బయటవేసి యిల్లూడ్చింది. 'బళ్లో ఎంకణ్ణి ప్రెసి డెంటు కొడుకు చితకతంతే చూసి వూరుకున్నా వంటగా......ఏందయ్యా మరీ అంత అన్యాయం?' అన్నది, పొయ్యి ముట్టిస్తూ. ఇంట్లో కూడా అదే మాట వినపడటంతో మేష్టారికి కోపం వచ్చింది. అయినా ఏవీా అనకుండా దానివేపు చూశాడు. ఇన్నాళ్ల నుంఛీ పనిచేస్తున్నా ఎప్పుడూ దాన్ని సరిగా గమ

నించలేదు. అది సన్నగా రివటలాగా ఛలాకీగా వున్నది. ఒళ్లు వల్లగా నున్నగా వున్నది. ఏదో ఆకలి నిత్య స్థావరం ఏర్పరచుకున్నట్లుగా మొహం ఎండుకుపోయి కళ్లు మెరుస్తున్నాయి. మాట్లాడినప్పుడు పళ్లు పెద్దగా తెల్లగా వరుసగా కన్పిస్తున్నాయి. మేష్టారి దృష్టి తొడలపైకి ఎగగట్టిన చీర క్రిందనుంచీ కన్పిస్తున్న కాళ్లమీద నిలిచింది. పైన మనిషి ఎంత సన్నగా వున్నదో కాళ్లు అంత బలంగా స్తంభాల్లాగా వున్నై. మోటుగా అసహ్యంగా లావుగా వున్నై.

మేష్టారి చూపు గమనించి రత్తి కాస్త తొట్రుపడ్డది. 'ఏందయ్యా అట్లా పడుకున్నావ్? జెరంగానీ ఒచ్చిందా?' అంటూ దగ్గరికొచ్చింది. వేడి చూస్తున్నట్లు అయన చెయ్యిపట్టుకున్నది. మేష్టారికి అసహ్యంతో ఒళ్లు గగుర్పొడిచింది. 'ఏమీలేదు... ఏమీ లేదు' అన్నాడు కంగారుగా చెయ్యి విదిలించుకుంటూ.

ఎప్పుడు ఎల్లా ఒచ్చాడో బాసడు 'ఒసే, రంకు ముండా...యిదంటే నువ్వు చేసేపని! పద యింటికి...' అన్నాడు. మేష్టారికి ముచ్చెమటలు పోశాయి. లేచి ఒణుకుతూ నిలబడ్డాడు. బాసడు రత్తి వీపుమీద దబదబా నాలుగు గుద్దులు వేశాడు. కొట్టబోతూన్నట్లుగా మేష్టారి దగ్గరకువచ్చి 'నీ సంగతి మళ్లీ చూస్తాలే' అనేసి రత్తిని యీడ్చుకెళ్లిపోయాడు.

తలుపు గట్టిగా గడియ వేసుకొని చాపమీద కూలబడ్డాడు మేష్టారు. ఒంట్లో ఒణుకు తగ్గలేదు. బాసడి రౌద్రరూపం ఎదురుగా వున్నట్లే, వాడు కొట్టబోతున్నట్లే వున్నది. ఎక్కడికన్నా పారిపోదామా అనిపించింది. ఒంటరిగా బయటి చీకట్లోకి పోవటానికి భయంవేసి నిస్సత్తువగా కూర్చుండిపోయాడు. 'కోపతాపాలంటే అసహ్యం నాకు. దెబ్బంటే చీదర' అనుకున్నాడు.

...చిన్నప్పటి తెలుగు మేష్టారు గుర్తొచ్చాడు. పుస్తకాలు క్లాసుకు తీసుకురాకపోయినా, ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోయినా బెంచిమీద నిలబెట్టి పొట్టలో పిండేవాడు, పిడికిట్లోంచీ బొటనవ్రేలు బయటికిపెట్టి డొక్కలో యీ ప్రక్కా ఆ ప్రక్కా పొడిచేవాడు. ఆయనంటే తనకూ సింహస్వప్నంగా వుండేది. తనెప్పుడూ పొరపాటు చెయ్యలేదు—ఒక్కసారి తప్పించి. ఆ సారి మేష్టారు కొట్టడానికి వస్తుంటే ముచ్చెమటలూ పోశాయి. బెంచి ఎక్కబోతూ క్రిందపడిపోయాడు. ముందున్న డెస్కు నుదుటికి కొట్టుకొని రక్తం ధార కట్టింది. కాని దెబ్బలు తప్పిపోయినై.

ఇంకా చిన్నతనంలో ఓసారి అమ్మ డబ్బుల్లోంచీ చెప్పకుండా అర్ధరూపాయి తీసుకొని పక్కింటి వాళ్లతో సినిమా కెళ్లాడు. తిరిగి రాగానే 'దొంగవెధవా, చెప్పకుండా డబ్బులెత్తుకు పోతావా' అంటూ చేతిలో వున్న ఇనుప వూదుగొట్టం పైకెత్తింది కొట్టడానికి. తాను భయపడి బయటకు పరుగెత్తాడు. ఆమె తలుపు లోపల గడియ వేసుకుంది. బయటంతా చిమ్మ చీకటి. ఆ చీకట్లోవుండే నల్లటి భూతాలన్నీ వచ్చి తనచుట్టూ ఆడటం మొదలెట్టాయి. ఎంత పిలిచినా ఆమె తలుపు తీయలేదు. భయంతో కొయ్యబారిపోయి నల్లటిచీకట్లో నిలబడిపోయాడు. లోపలి దీపపు వెలుగుతో ముందుగది కిటికీ మెరుస్తోంది. 'నేను ఆ వెలుతురునే చూస్తుంటే చీకటి దయ్యాలు నన్నేమీ చెయ్యలేవు. కొంచెం ఏమరినా అవి నన్ను మింగేస్తాయి' అని తనకు తానే చెప్పుకున్నాడు. మనసును గట్టిగా బిగబట్టుకొని ప్రాణాలు కళ్లలో పెట్టుకొని కిటికీవేపు చూస్తూ వుండిపోయాడు. రెండో ఆట సినిమాకు వెళ్తున్న కొట్టుసీతయ్య చూసి తలుపు తీయించి లోపలికి పంపించాడు...

తలనొప్పితో కలత నిద్రపోయాడు మేష్టారు. అర్ధరాత్రి తలుపు బాదిన చప్పుడుకు మెలకువ వచ్చింది. ఒణుకుతూనే తలుపు తీశాడు. బయట చీకట్లో పెద్దదుడ్డుకర్రలు పట్టుకొని సాయెబు, బాసడు, వాళ్లవెనుక యింకో పదిమందీ యమకింకరుల్లా నిల్చుని వున్నారు. హరికేన్ దీపం వెలుగు సన్నగా మసగ్గా వాళ్లమీద పడుతోంది. అందరూ బాగా తాగి మంచి నిషామీద వున్నట్లున్నారు. 'దొంగ సన్యాసిముండాకొడుకుని ఎయ్యండ్రా'

అంటూ కర్రపైకెత్తాడు సాయెబు. వెనుకనున్నవాళ్ళు ప్రక్కలకువచ్చి కర్రలు పైకెత్తారు. చీకటిలాంటి కొండచిలువ మింగటానికి వస్తున్నట్లనిపించింది. చేతులూ రెండూ నెత్తిమీద పెట్టుకొని 'ఒద్దు, ఒద్దు' అంటూనే క్రిందపడిపోయాడు మేష్టారు.

బాసడి కర్ర మీదపడ్డది. సాయెబు పడిపోయిన మేష్టార్ని కాలితో ఒక్కతోపు తోశాడు. 'దెబ్బపడకుండానే కూలిపోయాడ్రా పిరికి ఎదవ' అన్నాడు. క్రిందికివంగి తాకిచూచాడు. 'సచ్చినట్టున్నాడు...రెండు పుతికి పోదామంటే వూరికె సచ్చాడ్రా నా కొడుకు' అన్నాడు లేచి నిల్చొని ఎంగిలి వుమ్మేస్తూ. 'పదండి...పదండి...' అనుకొంటూ పరుగెత్తుతూ చీకట్లో కలిసిపోయారు అందరూ.

బోర్లా పడిపోయివున్న సత్యం మేష్టారికి కాస్త దూరంలో చాపమీద వున్నది, 'భజగోవిందం' పుస్తకం—భద్రంగా...